పాఠశాలల్లో 10లోగా పనులు పూర్తి చేయాలి

ధర్పల్లి, జూన్ 6 : అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద పాఠశాలల్లో కొనసాగుతున్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీవో బాలకృష్ణ సూచించారు. గురువారం మండలంలోని గుడితండా, ఇందిరానగర్ తండా, బెల్యా తండా, గోవింద్‌పల్లి గ్రామాల్లో పర్యటించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈనెల 10లోగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

చండ్ర రాజేశ్వరరావుకు నివాళి

ఖిల్లీవాడి, జూన్ 6: జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో స్వాతంత్ర్య, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు చండ్ర రాజేశ్వరరావు 110వ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జిల్లా కార్యదర్శి సుధాకర్ మాట్లాడుతూ..సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా చండ్ర రాజేశ్వరరావు పని చేశారని, ఆయనకున్న వందల ఎకరాల భూమిని పేదలకు పంచినట్లు గుర్తుచేశారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ నియోజకవర్గ కార్యదర్శి వై.ఓమయ్య, జిల్లా నాయకులు బి.రఘురాం, అంజలి, హన్మాండ్లు, సాయిలు పాల్గొన్నారు.

పాఠశాలకు ఏకరూప దుస్తుల పంపిణీ

మోస్రాలో యూనిఫామ్ అందజేస్తున్న డీఆర్డీవో సాయాగౌడ్

చందూర్, జూన్ 6: మోస్రా మండల కేంద్రంతోపాటు చందూరు మండలంలోని లక్ష్మాపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలలకు ఏకరూప దుస్తులను డీఆర్డీవో సాయాగౌడ్, అదనపు డీఆర్డీవో రవీందర్ గురువారం పంపిణీ చేశారు. సకాలంలో విద్యార్థులకు యూనిఫామ్ అందించిన డ్వాక్రా మహిళలను వారు అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఏపీఎంలు పద్మావతి, ముఖీమ్, సీసీలు లింగాగౌడ్, ప్రవీణ్‌కుమార్, హెచ్ఎంలు రాంచందర్,లక్ష్మీ నర్సింహం, ఎస్ఎంఎస్ చైర్‌పర్సన్లు పోశవ్వ, రేఖ, పుష్పలత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'అర్వింద్ ..మాటలు అదుపులో పెట్టుకో..'

ఇందల్వాయి, జూన్ 6 : రెండోసారి ఎంపీగా గెలిచిన ధర్మపురి అర్వింద్ మాటలను అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ ప్రొఫెసర్ విద్యాసాగర్‌రావు అన్నారు. గురువారం డిచ్‌పల్లి మండలంలోని ధర్మారం(బీ) గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిపై అర్వింద్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఐదేండ్లలో అర్వింద్ చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అరవింద్‌ను చూసి ఎవరూ ఓటు వేయలేదని, మోదీ చొరవతోనే ఓటు వేశారన్నారు. అర్వింద్‌కు బీజేపీ కార్యకర్తలే వ్యతిరేకంగా ఉన్నారని, ఇప్పటికైనా బుద్ధి మార్చుకోవాలని సూచించారు.

విత్తనాల పంపిణీ

ఆలూర్, జూన్6: మండలంలోని కల్లెడి గుత్పా గ్రామాల్లో జీలుగ విత్తనాలను గురువారం గ్రామ ప్రత్యేక అధికారిణి ఉమాదేవి రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు బూరోల్ల అశోక్, మచ్చర్ల రమేశ్, ఇస్సాపల్లి నర్సయ్య, భూత అన్వేశ్ పాల్గొన్నారు.

శిఖం కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

మాక్లూర్, జూన్ 6: మండలంలోని చిక్లీ గ్రామంలో చింతల చెరువు, కుంట పెద్ద చెరువు అలుగును ధ్వంసం చేసి చెరువు శిఖం భూములను కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ వీడీసీ సభ్యులు తహసీల్దార్ షబ్బీర్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. గతంలో వినతిపత్రం అందజేసినా చర్యలు తీసుకోకుండా జాప్యం చేశారని, ఇప్పటికైనా బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలి

నందిపేట్‌లో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

నందిపేట్, జూన్ 6: మండల కేంద్రంలో గురువారం ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మలేరియా, డెంగీ వ్యాధుల నియంత్రణపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇండ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని, పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. జ్వరాలు వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా దవాఖానలో చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రవీణ్‌రెడ్డి, ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కాపర్ వైర్, ఆయిల్ చోరీ

ఎడపల్లి, జూన్ 6: మండలంలోని మంగళ్ పాడ్ గ్రామ శివారులో పంట పొలాల వద్ద రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి కాపర్ వైర్, ఆయిల్‌ను గుర్తు తెలియని దుండగులు గురువారం తెల్లవారుజామున ఎత్తుకెళ్లారు. పంటపొలాల వద్ద రైతులు నీరు పారకానికి గురువారం ఉదయం వెళ్లారు. ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను గమనించి ఎడపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

బోధన్‌లో వైద్యశిబిరం

శక్కర్‌నగర్, జూన్ 6: బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జీవన్‌సేవ వెల్నెస్ సేవ ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు నాగనాథ్, అర్షద్‌ను పలువురు సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు తుమ్మల దేశాయ్, రవిశంకర్ గౌడ్, షేక్ మహమ్మద్, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

'బడిబాట'లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు

కోటగిరిలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, పిల్లలు

మోర్తాడ్/వేల్పూర్/బాల్కొండ/మాక్లూర్/బోధన్ రూరల్/కోటగిరి/ ఇందల్వాయి/ సిరికొండ/ చందూర్, జూన్ 6: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని, డ్రాప్‌అవుట్ పిల్లలు, అసలే బడికిరాని పిల్లలను బడిలో చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కోరారు. గురువారం జిల్లాలోని పలు మండలాల్లో బడిబాట కార్యక్రమం నిర్వహించారు.

కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, ప్రజాప్రతినిధులతో ఎంఈవో ఆంధ్రయ్య సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, అల్పాహారం, నోట్‌పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌ను అందిస్తున్నదని, అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద మౌలిక వసతులు కల్పిస్తోందని వివరించారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని, గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో బడీడు పిల్లల ఇండ్లకు పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు.

బాల్కొండలో ఎంఈవో బట్టు రాజేశ్వర్, ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. వేల్పూర్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉపాధ్యాయులు ఇంటింటికీ తిరుగుతూ పిల్లలను పాఠశాలలో చేర్పించాలని కోరారు.

మాక్లూర్ మండలంలోని అమ్రాద్ గ్రామంలో హెచ్ఎంలు లక్ష్మీనారాయణ, సురేశ్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

బోధన్ మండలంలోని కల్దుర్కి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమలో హెచ్ఎం నాగయ్య, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, పీఈటీ సాయిబాబా ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. రచ్చగల్లీ స్కూల్‌లో పిల్లలకు అవగాహన కల్పించారు. ఇందల్వాయి, డిచ్‌పల్లి మండలాల్లో ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం నాణ్యమైన బోధన అందిస్తుందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.

జడ్పీహెచ్ఎస్ రావుట్ల ఉపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ గ్రామాభివృద్ధి కమిటీతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని తీర్మానించారు. విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి బడి బయట ఉన్న పిల్లలను బడిలో చేర్పించాలని కోరారు.

మోస్రా మండల కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాలాజీ రావు, సిబ్బంది తో కలిసి ఇంటింటికీ తిరిగారు. తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు.

కిస్తీ డబ్బులు కాజేసిన మేనేజర్!

వినాయక్‌నగర్, జూన్ 6: వాహనాల కిస్తు కట్టడానికి ఇచ్చిన డబ్బులను ఓ ప్రైవేట బ్యాంకు మేనేజర్ కాజేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలు.. నగరంలోని వినాయక్‌నగర్ ప్రాంతంలో ఉన్న ఐడీఎఫ్‌సీ ఫస్ట్ ప్రైవేటు బ్యాంకు నుంచి జిల్లా కేంద్రానికి చెందిన విష్ణుప్రసాద్ వాహన కొనుగోలుకు రుణం తీసుకున్నాడు. కిస్తీలు చెల్లించాలంటూ వాహనాలు కొనుగోలు చేసిన వారికి మేనేజర్ దత్తు రెడ్డి ఫోన్ చేశాడు. ఈ క్రమంలో విష్ణు ప్రసాద్ కిస్తును చెల్లించడానికి వెళ్లగా.. ఆన్‌లైన్ ద్వారా తమ సిబ్బందికి చెల్లించాలని సదరు మేనేజర్ సూచించాడు. దీంతో విష్ణుప్రసాద్ మేనేజర్ సూచించిన బ్యాంకు సిబ్బంది ఇద్దరికి ఒక్కొక్కరికీ రూ.50వేల చొప్పున ఆన్‌లైన్ ద్వారా చెల్లించాడు. ఇందుకు రసీదు ఇవ్వాలని మేనేజర్‌ను అడుగగా మళ్లీ ఇస్తానని దాటవేశాడు. రెండు రోజుల క్రితం విష్ణుప్రసాద్ బ్యాంకుకు వెళ్లగా మేనేజర్ అందుబాటులో లేకపోగా.. అతని ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ వచ్చింది. తాను ఆన్‌లైన్ ద్వారా డబ్బులు చెల్లించిన ఇద్దరు బ్యాంక్ సిబ్బందిని అడుగగా.. ఆ డబ్బులను మేనేజర్‌కు ఇచ్చేసినట్లు వారు సమాధానమిచ్చారు.దీంతో బాధితుడు నాల్గోటౌన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై సంజీవ్ సంప్రదించగా..రెండు రోజుల క్రితం కౌంటింగ్ రోజున బాధితుడు వచ్చాడని, ఆ సమయంలో తాను అందుబాటులో లేనని తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సదరు మేనేజర్ కోసం వాకబ్ చేయగా అతడు ఇంట్లో లేడని తేలిందని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యార్థులకు ధ్రువపత్రాల అందజేత

ధర్పల్లి, జూన్ 6: మండల కేంద్రంలోని చాణక్య టెక్నాలజీ ఆధ్వర్యంలో కంప్యూటర్ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులకు గురువారం ధ్రువపత్రాలను అందజేశారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ఉచితంగా కంప్యూటర్ కోర్సు నేర్పించినట్లు నిర్వాహకులు చాట్ల ప్రణీత్ తెలిపారు. ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేసినట్లు పేర్కొన్నారు.

లింగాపూర్ కార్యదర్శి పై విచారణ

కోటగిరి, జూన్ 6: మండలంలోని లింగాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజుపై డీఎల్‌పీవో సాయిబాబా గురువారం విచారణ చేపట్టారు. విధి నిర్వహణలో కార్యదర్శి నిర్లక్ష్యం చేస్తున్నారని కొందరు గ్రామస్తులు డీపీవోకు ఫిర్యాదు చేశారు. డీపీవో ఆదేశాల మేరకు కోటగిరి ఇన్‌చార్జి ఎంపీడీవో మారుతితో కలిసి డీఎల్‌పీవో సదరు కార్యదర్శిపై విచారణ చేపట్టారు. వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు అందజేస్తానని డీఎల్‌పీవో తెలిపారు.

ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను సన్మానిస్తున్న ఐఎంఏ ప్రతినిధులు

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ దామోదర్‌రావు, వైద్యులు కొట్టూర్ శ్రీశైలం, విశాల్ ఆకుల, రాజేంద్రప్రసాద్, రామ్మోహన్‌రావు, చంద్రశేఖర్‌రావు, జీవన్‌రావు, వినోద్, కుమార్‌గుప్తా, రవీంద్రనాథ్ సూరి, అనుమల్ల సత్యనారాయణ, నర్సింగ్, రాజేశ్, భూమారెడ్డి, అయ్యప్ప చంద్రశేఖర్, ప్రజ్ఞ, మురళికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

–ఖిల్లీవాడి, జూన్ 6

మరమ్మతు పనులను వేగవంతం చేయాలి

డీఈవో దుర్గా ప్రసాద్

నవీపేట, జూన్ 6: మండలంలోని పలు గ్రామాల్లో రూ. 2.50 కోట్ల చేపడుతున్న అమ్మ ఆదర్శ పాఠశాలల్లో మరమ్మతు పనులను వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గా ప్రసాద్ పీఆర్ ఏఈ శ్రావణ్‌కుమార్‌కు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో బడిబాట కార్యక్రమంలో భాగంగా స్టేషన్ ఏరియా, ఆశనగర్ కాలోని నవీపేట పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను డీఈవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవీపేట మండలంలో 39 పాఠశాలలు అమ్మ ఆదర్శ పాఠశాల పథకంలో ఎంపికయ్యాయని, వాటిలో మరమ్మతు పనులకు రూ. 2.50 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. ఈనెల 12 లోగా ఆయా పాఠశాలల్లో మరుగు దొడ్లు, తాగునీటి సమస్యలు పరిష్కరించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయా పాఠశాల ఉపాధ్యాయులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, మండల విద్యాశాఖ అధికారి గణేశ్‌రావు, పీఆర్ ఏఈ శ్రావణ్‌కుమార్, బాలుర బాలికల పాఠశాలల ఎచ్ఎంలు రత్నకుమారి, అనిత, ఎచ్ఎంలు పాల్గొన్నారు.

పాఠశాలల పనుల పరిశీలన

ఆర్మూర్‌టౌన్, జూన్6: పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలలో కొనసాగుతున్న పనులను మున్సిపల్ కమిషనర్ రాజు గురువారం పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

ఆర్మూర్‌లో పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

పేకాటరాయుళ్ల అరెస్ట్

మోర్తాడ్, జూన్ 6: మండల కేంద్రంలో శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపారు. పక్కా సమాచారంతో దాడులు చేసి నలుగురిని పట్టుకున్నామని, వారి నుంచి రూ.16,570 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో పేకాట ఆడితే తమకు సమాచారం అందించాలని కోరారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు

శక్కర్‌నగర్, జూన్ 6: బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరాస్తాలో బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ప్రతి వాహనదారుడూ నిబంధనలు పాటించాలని కోరారు.

వాహనాల తనిఖీ

ఆర్మూర్‌టౌన్,జూన్6: పట్టణంలోని కొత్త బస్టాండ్ ఆవరణలో ఎంవీఐ వివేకానందరెడ్డి, ఎస్‌హెచ్‌వో రవి కుమార్ గురువారం వాహన తనిఖీ చేశారు. వాహనాలకు తప్పకుండా నంబర్ ప్లేట్లు ఉండాలని, సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ రమేశ్, ఎస్సైలు అశోక్, గంగాధర్ పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం

రెంజల్, జూన్ 6: నీలా గ్రామంలో నీల కంఠేశ్వరస్వామి ఆలయ భూములకు గురువారం దేవాదాయశాఖ అధ్వర్యంలో వేలం నిర్వహించినట్లు ఇన్‌స్పెక్టర్ కమల తెలిపారు. 27 ఎకరాలకు గాను 16 ఎకరాల 3 గుంటల భూమిని రూ. 1,60వేల 7వందలకు నలుగురు రైతులు దక్కించుకున్నట్లు ఆమె తెలిపారు. మిగితా 11 ఎకరాల భూమిని మందిరం ఫౌండర్ సునీల్ నీలేకర్ నాలుగు సంవత్సరాలకు గాను రూ. 84వేలకు దక్కించుకోగా ఏటా 10 శాతం పెంచిన డబ్బులతో మందిరాన్ని అభివృద్ధి చేస్తారని లఖిత పూర్వకంగా రాయించుకున్నట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ క్యాతం యోగేశ్, నాయకులు గౌరాజీ రాఘవేందర్ యాదవ్, మాజీ సర్పంచ్ రఘు, మాజీ ఉప సర్పంచ్ సుభాష్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీని పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

మోర్తాడ్, జూన్6: కమ్మర్‌పల్లి మండలంలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీవో చింత రాజశ్రీనివాస్ అన్నారు. గురువారం కమ్మర్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలో 2023-24 సంవత్సరానికి గాను ఉపాధి హామీ పథకంలో రూ.6.72కోట్ల పనులు చేపట్టగా రూ.3.10కోట్ల వేజ్ పేమెంట్, రూ.3.40కోట్ల మెటీరియల్ పేమెంట్ చేసినట్లు చెప్పారు. ఈనెల 7 నుంచి 18 వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో సామాజిక తనిఖీ కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో విద్యానంద్, సూపరింటెండెంట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

ఖిల్లీవాడి, జూన్ 6: నగరశివారులోని బోర్గాం(పి) జడ్పీహెచ్ఎస్ ఆవరణలో బాలబాలికల టాయిలెట్స్‌కు అడ్డుగా ఉన్న పెద్ద నీటి ట్యాంకును తొలగించి, ఇతరచోటికి తరలించాలని ఏఐఎఫ్‌డీఎస్ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో జాతీయ కన్వీనర్ మేత్రి రాజశేఖర్, నాయకులు గోపాల్, అనిల్, యశ్వంత్, అరుణ్ ఉన్నారు.

కోటగిరిలో ప్రైవేట్ దవాఖాన తనిఖీ

కోటగిరి, జూన్ 6: మండల కేంద్రంలో ఉన్న ప్రైవేట్ దవాఖానను పొతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కరణ్, ఆరోగ్య విస్తీర్ణ అధికారి గోవర్ధన్ గురువారం తనిఖీ చేశారు. ప్రాథమిక చికిత్స వివరాలను సేకరించారు. పరిసరాలను పరిశీలించారు. ఆర్ఎంపీ, పీఎంపీల ధ్రువపత్రాలు, ఆధార్ కార్డులు, ఫొటోలను పరిశీలించి, క్లీనిక్‌లో ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని సూచించారు. వారి వెంట సూపర్‌వైజర్ జ్యోతి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

ఘనంగా ఛత్రపతి పట్టాభిషేక మహోత్సవం

సుభాష్‌నగర్/కంఠేశ్వర్, జూన్ 6: నగరంలోని రైల్వే స్టేషన్ చౌరస్తా, బోర్గాం కమాన్ చౌరస్తా వద్ద ఉన్న శివాజీ మహరాజ్ ధ్వజం ప్రాంగణంలో శివాజీ మహరాజ్ సేవాసమితి ఆధ్వర్యంలో గురువారం పట్టాభిషేక మహోత్సవం నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ శివాజీని ఆదర్శంగా తీసుకొని దైవభక్తి, దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ రవికుమార్, ఆర్ఎస్ఎస్ గంగానర్సయ్య, వెంకటేశ్, సేవా సమితి సభ్యులు రవికుమార్, నరేంద్ర నాయుడు, గజానన్, రాజేంద్రప్రసాద్, విజయ్‌కుమార్, భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఖిల్లీవాడి, జూన్ 6: సూర్య ఆరోగ్య సంస్థ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన, ఉచిత వైద్య శిబిరాలు, పేద రోగులకు పోషకాహారం, పిల్లలకు కంటి, దంత సంరక్షణ తదితర సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు సంబంధించిన బ్రోచర్లను గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ చేకూరి సూర్యభగవాన్, సీఓఓ రాజేంద్రకుమార్ విక్రమ్, ఏవో చందర్, డీపీవో విశాలరాణి, జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ రవి, డీపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి'

కోటగిరి, జూన్ 6: మండలంలోని లింగాపూర్ వద్ద ఈతచెట్లను అక్రమంగా తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గీత పనివారాల సంఘం రాష్ట్ర కార్యదర్శి విఠల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లింగాపూర్ సమీపంలోని చెరువు కట్ట పక్కనే ఉన్న ఈత చెట్లను జేసీబీతో సాయంతో తొలగించడంపై ఆయన స్పందించి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిబంధనల ప్రకారం ఈత చెట్లను తొలగించాలంటే ఎక్సైజ్ అధికారుల నుంచి అనుమతి తీసుకోవాలన్నారు. ఈత చెట్లను నరికివేసిన వారిపై పీడీయాక్ట్ నమోదు అవుతుందన్నారు. పంచనామా చేసి గీత కార్మికుల కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. వెంకగౌడ్, శ్రీధర్‌గౌడ్, పండరిగౌడ్, యాదగిరిగౌడ్, రాజాగౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మొగులాగౌడ్, రమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

రాష్ట్ర చిహ్నం ప్రభుత్వానికి పంపించండి

ఆర్మూర్‌టౌన్,జూన్6: ధర్మ సమాజ్ పార్టీ నాయకులు పట్టణంలోని తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ గజానన్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఆపార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరకు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చిహ్నంగా మార్పును ఆహ్వానిస్తున్నామని అన్నారు. తమ పార్టీ రూపొందించిన రాష్ట్ర చిహ్నంను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించాలని తహసీల్దార్‌ను కోరారు. నాయకులు కాన్షీరాం, శ్రీనివాస్, నవీన్, అరుణ్, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

జోరు వాన

నందిపేట్/ ఆర్మూర్‌టౌన్/బోధన్ రూరల్, జూన్ 6: నందిపేట్ మండల కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో గురువారం జోరు వాన కురిసింది. ఉరుములు, మెరుపులతో బలమైన ఈదురుగాలులు వీస్తూ సుమారు గంటన్నర పాటు వర్షం కురిసింది. అక్కడక్కడ చెట్లు, కొమ్మలు విరిగిపోయి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై నుంచి వర్షపునీరు ప్రవహించింది. భారీ వర్షం కురవడంతో ఎండవేడి నుంచి ప్రజలకు కొంత ఉపశమనం కలిగింది. ఆర్మూర్‌తోపాటు మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది.

పిడుగుపడి గేదె మృతి

బోధన్ మండలలంలోని అమ్దాపూర్ గ్రామ శివారులో గురువారం సాయంత్రం పిడుగుపాటుతో గేదె మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దాత్రిక్ రమేశ్‌కు చెందిన గేదె పిడుగుపడి మృతి చెందిందని తెలిపారు. సమరు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తనను అదుకోవాలని కోరాడు.

వర్షానికి కూలిన పెంకుటిల్లు

కూలిన పెంకుటిల్లు

ఇందల్వాయి, జూన్ 6 : మండల కేంద్రంలో బుధవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో గ్రామంలోని గొల్లె సాయవ్వకు చెందిన పెంకుటిల్లు ధ్వంసమైంది. గురువారం మండల రెవెన్యూ అధికారి మోహన్ వెళ్లి పంచనామా నిర్వహించారు. జరిగిన నష్టం వివరాలను అధికారులకు తెలియజేస్తామని తెలిపారు. ఇల్లు కూలిపోవడంతో రోడ్డున పడ్డామని, ఆదుకోవాలని బాధితురాలు ప్రభుత్వాన్ని కోరారు.

షార్జాలో బీఆర్ఎస్ బోధన్ సోషల్ మీడియా కన్వీనర్ మృతి

ఆవేజ్ యాబా

బోధన్, జూన్ 6: బోధన్ పట్టణానికి చెందిన ఆవేజ్ యాబా (25) షార్జాలోని ఆల్ మంజర్ బీచ్‌లో స్విమ్మింగ్ కోసం వెళ్లి మృతి చెందినట్లు అక్కడి పోలీసులు గుర్తించారు. బోధన్ పట్టణంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్‌గా పనిచేసిన ఆవేజ్ యాబా మూడు నెలల క్రితం దుబాయికి వెళ్లినట్లు కుటుంబీకుల సమాచారం. ఆయన స్నేహితులతో కలిసి ఈనెల 2న బీచ్‌లో ఈతకు వెళ్లి మృతి చెందాడు. అక్కడి పోలీసులు విచారణ జరుపుతున్నారు.

చికిత్స పొందుతూ